క్లుప్తంగా

అమ్మవారికి వెండి సమర్పణ



అమ్మవారికి వెండిని సమర్పిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి వెండి పీటానికి దాతలు 250 గ్రాముల వెండిని విరాళంగా అందించారు. గురువారం పట్టణానికి చెందిన కూనపరెడ్డి హృషికేష్, పూర్ణకళ దంపతులు వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్ర పటాన్ని అందించి సత్కరించారు.

ఎక్సైజ్ కేసుల్లో ఐదుగురికి జరిమానా



తహసీల్దార్ ఎదుట హాజరైన ముద్దాయిలు

భీమవరం అర్బన్: ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఎక్సైజ్ కేసుల్లో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు తెలిపారు. మండలంలో దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన దొంగ శ్రీనివాస్, అనాకోడేరు గ్రామానికి చెందిన మల్లుల భానుచంద్ర, భీమవరం పట్టణానికి చెందిన నేతల వరప్రసాద్, లోసరికి చెందిన కుక్కల ఇందిర, భీమవరానికి చెందిన బొక్క రాజులను బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 127 కింద కేసు నమోదు చేశారు. అయినా ఏడాది కాల పరిమితిలో మళ్లీ ఎక్సైజ్ నేరం చేసి దొరికిపోవడంతో వారిని భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు ఎదుట హాజరు పరుచగా వారికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించారని సీఐ బలరామరాజు తెలిపారు.

శ్రీదేవి ట్రస్టు సేవలు అభినందనీయం

కాళ్ల: కాళ్లకూరులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు తరపున వెంకటరామరాజు చేస్తున్న సేవలు అభినందనీయమని ఏపీ డిప్యూటీ స్పీకర్ ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. కాళ్లకూరు గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం, విశ్రాంతి భవనాలను శుక్రవారం ఆయన ప్రారంభించి ట్రస్ట్ ద్వారా 30 మంది పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం నియోజకవర్గంలో సీసీ కెమెరాల కు సంబంధించి రూ.50వేల చెక్కును ఎస్సై శ్రీనివాసరావుకు, అదే విధంగా గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి రూ.5 వేల చొప్పున రెండు చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్, డీసీ చైర్మన్ గోకరాజు శివబాబు, మాజీ సర్పంచ్ అడ్డాల శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న పండితులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ద్వాత్రింశత్ వార శ్రీసూక్త సహిత అష్టలక్ష్మీ హవనం వైభవంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో ఏడిద త్రిమూర్తులు, శేషు వరహాలక్ష్మి దంపతులు, నిమ్మల రాంబాబు, భువన దంపతులు, కొండపల్లి మోహన్ కుమార్, ఊహా శ్రీలక్ష్మి దంపతులచే అర్చకులు శ్రీనివాస చార్యులు శ్రీవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుక్కల బాల, సరిపడకల రామారావు, జానపాటి మధు, పెన్నడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, అల్లు రామారావు, కడలి ఫణి కుమార్, అల్లం రమేష్, నళిని మోహన్, మామిడిశెట్టి జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో రథోత్సవం

గోవింద నామస్మరణతో శ్రీవారి రథోత్సవం వైభవంగా ముందుకు సాగింది. శుక్రవారం రాత్రి హౌసింగ్ బోర్డు కాలనీలోని వేంకటేశ్వర స్వామి 14వ వార్షిక కళ్యాణ బ్రహ్మో త్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి, గుడ్డ సంచులను వాడటం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. విజ్ఞాన వేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో వీరమ్మ పార్క్ సెంటర్‌లో ప్లాస్టిక్ నిషేధ ప్రచార ర్యాలీ, ప్రతిజ్ఞ, ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే దుకాణాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. లక్ష్మి భవానీ, శ్రీదేవి, మాణిక్యాంబ, రాణీ, రాట్నాల శ్రీనివాస్, మాదాసు బాబీ పాల్గొన్నారు.

దోమల బెడదతో ప్రజల విలవిల



పట్టణంలోని చినరంగని పాలెం వద్ద రోడ్డుపై వేసిన చెత్తాచెదారం



ఆర్టీసీ డిపో వద్ద అధ్వానంగా ఉన్న డ్రెయిన్

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో దోమల బెడదతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్లు, చెత్తాచెదారంతోపారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రులు ఆరుబయట, ఫ్యాన్ ఆగితే దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమల వలన రోగాల పాలవుతున్నారు. దోమల వలన జ్వరాలు వ్యాప్తిస్తున్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడం వలన వేసవిలో దోమల ఉధృతి ఎక్కువగా ఉంది. దోమల నివారణ చర్యలకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పట్టణంలో 39 వార్డుల్లోనూ దోమల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. దోమల నివారణకు అధికారులు గుర్తొచ్చినపుడు అక్కడక్కడా ఫాగింగ్ చేస్తున్నారు. అధ్వాన ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ జల్లించడం లేదు.

అధ్వాన డ్రెయిన్లు, ఖాళీ స్థలాలతో దోమల విజృంభణ

పట్టణంలోని డ్రెయిన్లు, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం వలన దోమలు పెరుగుతున్నాయి. డ్రెయిన్ల బాగుచేత, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం, మొక్కలు తొలగించే చర్యలు అధికారులు తీసుకోవడం లేదు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కోట్ల రూపాయల నిధులు ఉన్నా మున్సిపాలిటిలో డ్రెయిన్లు అధ్వానంగా ఉండడం దారుణం.

తాండవిస్తున్న అపారిశుద్ధ్యం

పట్టణంలో హోటల్స్ ఉన్న ప్రాంతంల్లో, రోడ్డు మార్జిన్‌పై ఉండే దుకాణాల వద్ద అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. హోటళ్లలోని వాడకం నీరు, మిగిలిన పోయిన ఆహారం, నిల్వ ఉన్న ఆహారం చెత్తాచెదారం డ్రెయిన్లలోకి వదిలి వేయడం, రోడ్డు మార్జిన్లలో వేయడం వలన అక్కడ దోమలు పెరిగిపోతున్నాయి. దీంతో స్థానికులు దోమల వలన ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతాల్లో జనం నిలబడితే చాలు దోమ కాటుకు విలవిలలాడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో పట్టణ ప్రజలకు దోమల వలన వ్యాధులు వ్యాప్తించి వర్షాకాలం మాదిరిగా ఆసుపత్రులకు క్యూ కట్టే పరిస్థితి వస్తుంది.

పేదల ఇళ్ల కూల్చివేతపై సీపీఎం నిరసన



ఉండి: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



భీమవరం అర్బన్: ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



పాలకోడేరు: ఆందోళనలో పాల్గొన్న నాయకులు



ఆకివీడు: వైఎస్సార్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఉండి: నిరుపేదల ఇళ్ల కూల్చివేతపై సీపీఎం నాయకులు నిరసిస్తూ ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై రఘురామకృష్ణరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సెంటర్‌లో సీపీఎం మండల కార్యదర్శి చీర్ల శేషు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారం చేపట్టిన అనంతరం ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేక నియోజకవర్గంలో నిరుపేదలపై ఎమ్మెల్యే తన ప్రతాపం చూపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరవల్లి మాధవరావు, కొట్టాడ వెంకటేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం , చీర్ల శ్రీనివాస్, కడలి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: పాలకోడేరులో పేదల ఇళ్లు కూల్చివేశారని పరామర్శించడానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్‌రావు వచ్చారు. బాధితులను పరామర్శించడానికి వచ్చిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శిపై స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బొర్రా అలమహారాజు,అయినపూడి బాబురావు, ఏళ్ళ బండి, కోతుల మత్యుంజయ నారాయణమూర్తి, యండమూరి సుబ్బారావు, కిలాడి సత్యనారాయణ, లింగం సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాస్, గొట్టుముక్కల శ్యాంబాబు, కుడిపూడి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో..

భీమవరం అర్బన్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెంప గ్రామంలో బస్‌స్టాండ్ సెంటర్‌లో శుక్రవారం సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇంజేటి శ్రీనివాస్, చిలకపాటి ఆనంద్, భూపతి సామ్యేయేలు, కాటికి సంపతరావు, వర్ధనపు నరసింహులు, బొబ్బనపల్లి రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో

పాలకోడేరు: డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దున్న మరియమ్మ, మల్లుల వెంకటేశ్వరరావు, మెట్ల రామారావు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, భేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఎం ఏరియా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో శుక్రవారం పెంకి అప్పారావు అధ్యక్షతన నిరసన ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.రవితేజ, బి.రాంబాబు, సందక ఉదయకుమారి, బి.కళ్యాణి, సాకా కిసింజర్, ఎస్కే వలీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆకివీడు: అయిభీమవరం రోడ్డులో శుక్రవారం రాత్రి వేగంగా వచ్చిన తెలంగాణకు చెందిన టీఎస్ 13 ఎఫ్‌బీ 3558 కారు, మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరిగిపోవడంతో అతడిని 108లో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి పోలీసులకు సమాచారం అందాల్సి ఉంది.

అదనపు కట్నం కేసు నమోదు

భీమవరం: భర్త, అత్తమామలు, బావ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వెంకటరాజు నగర్‌కు చెందిన గొట్టు ముక్కల సత్యసాయి కృష్ణవేణి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి టూటౌన్ ఏఎస్సై రసింహస్వామి తెలిపిన వివరాల ప్రకారం సత్యసాయి కృష్ణవేణి ఉండి మండలం కోలమూరుకు చెందిన ఫణికుమార్‌ను 2023లో రెండో వివాహం చేసుకున్నారు. అయితే కొంత కాలంగా భర్త, అత్తమామలు, బావ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. లండన్‌లో ఉంటున్న బావ ఎక్కువగా ఫోన్ చేసి అదనపు కట్నం తీసుకురావాలని చెప్పమని తమ్ముడితో వేధిస్తున్నట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నరసింహస్వామి తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

భీమవరం అర్బన్: ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ సంఘం విస్సాకోడేరు యూనిట్ అధ్యక్షుడిగా జి.నాగేశ్వరరావును, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల అధికారిగా ఎం.యజ్ఞ సంతోష్, పరిశీలకులుగా జిల్లా శాఖ అధ్యక్షుడు జి. శ్రీధర్‌రాజు, ట్రెజరర్ యోహన్ల సమక్షంలో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు.

28 నుంచి సువార్త సభలు

ఉండి: ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు చెరుకువాడ వడ్డిగూడెంలోని 15వ వార్షిక ఏసుక్రీస్తు రక్షణ సువార్త మహాసభలు నిర్వహిస్తున్నట్లు బ్రదర్ ఎరిచర్ల ఇమ్మానుయేలు, సిస్టర్ హెప్సీ తెలిపారు. వడ్డిగూడెం శివారు సాగర్ల శాంతినగర్‌లో నిర్వహించే ఈ సభలకు వర్తమానికులుగా బ్రదర్ వి.ఐజక్(హైదరాబాద్), బ్రదర్ డి.ప్రసాద్ (దుల్ల) విచ్చేస్తున్నట్లు వారు తెలిపారు. ఉదయం పదిన్నర నుంచి, సాయంత్రం ఆరు గంటల నుంచి సభలను ప్రారంభిస్తామని తెలిపారు.

నిధిశ్రీకి అభినందనలు

వీరవాసరం: గ్రామానికి చెందిన బండారు నిధిశ్రీ పదో తరగతి ఫలితాల్లో 597 మార్కులు సాధించడంపై శుక్రవారం పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు. నిధిశ్రీ మాట్లాడుతూ ఐఐటీలో సీటు సాధించి ఇంజినీర్ కావాలనుకుంటున్నానని వివరించారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, వీరవాసరం మండలం పరిషత్ చైర్మన్ వీరవల్లి దుర్గా భవాని చంద్రశేఖర్, జెడ్పీటీసీ గుండా జయప్రకాశ్, తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకం పెరగాలి



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కళాశాల డైరెక్టర్

భీమవరం: సాంప్రదాయేతర ఇంధన వనరుల ఉపయోగం పెరగాల్సిన ఆవశ్యకత ఉందని దానికి అనుగుణంగా ప్రాజెక్టులు రూపొందించాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు శుక్రవారం ట్రిబుల్‌ఈ మెషిన్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో ప్రాజెక్టులు కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సోలార్ ఎనర్జీ ఇన్వర్టర్స్ ద్వారా స్టోర్ చేసి వాటిని ఏ విధంగా వినియోగంలోకి తీసుకురావొచ్చనే అంశంపై ఫైనలియర్ విద్యార్థులు ఎం.లలితాశ్రీ జైదీపిక, ఎస్.మనోజ్ఞ, ఎం.లోహిత, కె.వేణు వందన, ఎం ప్రవీణ్ కుమార్ రూపొందించిన సోలార్ బేస్ట్ హైబ్రిడ్జ్ ఇన్వర్టర్ ఫేసింగ్ మెట్ ల్యాబ్ ప్రాజెక్టును పరిశీలించారు. కొంత మంది విద్యార్థులు సోలార్ పవర్‌తో కారు స్టార్ట్ చేసి తర్వాత ఆటోమేటిక్‌గా ఇన్వర్టర్ బ్యాటరీతో కారు నడపొచ్చంటున్నారని ఇటువంటి అంశాలు ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సహాయంతో రూపొందించిన సుమారు 39 ప్రాజెక్టులు భావితరాల అవసరాలు తీర్చే విధంగా విద్యార్థులు వినూత్న ఆలోచనలతో రూపొందించడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ హెడ్ బీహెచ్ఆర్‌కే వర్మ మాట్లాడుతూ ప్రాజెక్టులు రూపొందించి వాటిని ప్రదర్శించడం ద్వారా మంచి అవకాశాలు పొందగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ అసిస్టెంట్ శ్యామ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పక్షుల దాహార్తిని తీర్చుదాం



పక్షుల పరికరాలు అందిస్తున్న ఎంపీపీ

ఉండి: నోరులేని మూగజీవాలకు మనమంతా అండగా నిలిచి వాటికి కనీస సౌకర్యాలు కల్పించి మానవత్వాన్ని చాటుకుందామని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు.శుక్రవారం కలిసిపూడిలో ఐక్య నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పక్షులకు ఫీడింగ్, డ్రింకింగ్ పరికరాలను స్థానికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మనతో పాటుగా కలిసి జీవిస్తున్న పశుపక్షాదులకు అండగా నిలవాల్సిన భాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గాదిరాజు రంగరాజు, ముదునూరి అచారి, ముదునూరి గోపాలరాజు, మాసాబత్తుల రామకృష్ణ, వీవీఎస్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపించాలి



జిల్లా కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

పాలకోడేరు: మోగల్లు సుబ్బరాజు చెరువు వాసులు ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నారని అర్ధాంతరంగా ఇల్లు తొలగిస్తామని చెప్తే ఎక్కడికి వెళతారని తక్షణం ప్రత్యామ్నాయం చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ కోరారు. భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి సుబ్బరాజు చెరువు వాసులు, సీపీఎం నేతలు శుక్రవారం వినత పత్రాన్ని అందజేసి స్థానికంగా ఏర్పడిన ఇళ్ల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ సుబ్బరాజు చెరువు ప్రాంతలో 23 కుటుంబాలు ఎన్నో ఏళ్ల నుంచి ఈ స్థలాన్ని నమ్ముకుని ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. నోటీసులు ఇచ్చి ఇల్లు తొలగిస్తామని చెబితే వాళ్ళు ఎక్కడికి వెళ్తారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ నాగరాణి సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శేషాపు ఆశ్రీయ, దున్నా మరియమ్మ, వెంకటేశ్వరరావు, రామారావు, సత్యవతి, లక్ష్మి పాల్గొన్నారు.

సహకార సంఘాలతోనే మహిళా సాధికారత



సమావేశంలో మాట్లాడుతున్న సహకార సంఘాల జిల్లా అధికారి నాగరాజు

పాలకోడేరు: మహిళలు గ్రామ సంఘాలుగా ఏర్పడి, మండల, జిల్లా సమాఖ్యల్లో భాగస్వాములై సామాజికంగా, ఆర్థికంగా పురోగమిస్తూ, లింగ వివక్షకు తావు లేకుండా తమ హక్కులను కాపాడుకోవచ్చని పశ్చిమగోదావరి జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు ఉద్బోధించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 పురస్కరించుకుని శుక్రవారం పాలకోడేరులోని మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమాఖ్య సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎం.నాగరాజు మాట్లాడుతూ సంఘాలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయనే నినాదంతో ఈ ఏడాది జిల్లా అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలతో కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుని సెమినార్లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలోజిల్లా సమాఖ్య కార్యదర్శి వి.కమల, కోశాధికారి ఎం.జాజికుమారి డీపీఎంలు డి.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస్ ప్రసాద్, ఎస్.కుసుమకుమారి ఏజీఎం కృష్ణ నాయుడు సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పి.రామదాసు, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్ర దాడి అమానుషం



భీమవరం: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



ఆకివీడు: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎండీ బిలాల్



ఎస్కే ఆరీఫ్

ఆకివీడు: కాశ్మీర్‌లో పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి అమానుషమని వైఎస్సార్‌సీపీ మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎస్కే ఆరీఫ్ అన్నారు. ముష్కరుల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉగ్రవాదులను మట్టుబెట్టాలని డిమాండ్ చేశారు.

ముమ్మాటికీ దేశంపై జరిగిన దాడే

పహల్గాంలో ఉగ్రవాదుల దాడి యావత్ దేశంపై జరిగిన దాడి అని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎండీ. బిలాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముష్కరులను మట్టుబెట్టేందుకు ప్రపంచమంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎండీ జక్కీ, భీమవరపు ఆతీఫ్, ఎండీ అజ్మల్, ఆసిఫ్, మొబిన్, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడులను ఖండిస్తున్నాం

భీమవరం (ప్రకాశంచౌక్): పహల్గాంలో ఉగ్రవాదుల దాడులను ఖండిస్తున్నామని స్వచ్ఛంద సంస్థ సభ్యులు అన్నారు. భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో స్వచ్ఛంద సంస్థలు, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఉగ్రవాదుల దాడిలో మరణించిన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కార్తీక్, దూలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడి మృతులకు సీపీఐ నివాళి

భీమవరం: కాశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన దాడిలో 28 మంది ప్రాణాలు కోల్పోవడం బాధకరమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. దాడిలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. పహల్గాం దాడిని ఖండిస్తున్నామని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. ఈ మేరకు ప్రకాశం చౌక్‌లో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నాయకులు పొలా త్రిమూర్తులు, పి.యాకోబు, నరేష్, రామానాయుడు, నందీశ్వరరావు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



దుంపగడపలో దగ్ధమైన తాటాకిల్లు

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామంలోని రైల్వే గేటు సమీపంలో నివసిస్తున్న తాపీ మేస్త్రి బొర్రా వెంకటేశ్వరరావుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా కాలి బూడిదైంది. తాపీ పని ముట్లు, విద్యుత్ మోటార్లు కాలి పోయాయి. విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు చెప్పారు. సంఘటనలో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. బాధితులను సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొట్టు మాణిక్యాలరావు పరామర్శించారు.